సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కలిదిండి గ్రామానికి చెందిన కృష్ణచైతన్య, మాధురి, దీపక్ శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆక్వా సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

మత్స్య సంపద సృష్టిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వీటి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. - IIలో▸

కడలిలోకి 4.24 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,24,387 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.90, భద్రాచలం వద్ద 28.80 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

పాలనాంశాలపై అవగాహన అవసరం



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీపీఓ సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పరిపాలనాపరమైన అన్ని అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జేవీ సత్యనారాయణ అన్నారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నగరంలో నిర్వహించిన రెండో బ్యాచ్ శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పొందిన కార్యదర్శులకు డీపీఓ సత్యనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల్లో అనధికార లే అవుట్లు ఎక్కువగా ఏర్పడకుండా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. పంచాయతీల ఆర్థిక పరిపుష్టిలో కీలకంగా వ్యవహరించాలన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని సూచించారు. సోమవారం నుంచి మూడో బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ ఆర్మ్‌స్ట్రాంగ్ తెలిపారు.

పంపా తీరం.. భక్త జన సంద్రం

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన పెళ్లి బృందాలు, భక్తులతో రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. పంపా నదీ తీరం భక్తులతో నిండిపోయింది. శనివారం దశమి పర్వదినానికి తోడు రెండో శనివారం సెలవు దినం కావడంతో భారీగా భక్తులు తరలి వచ్చారు. దీనికి తోడు శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో సుమారు 50 వివాహాలు జరిగాయి. ఇక్కడ వివాహాలు చేసుకున్న దంపతులు, వారి బంధుమిత్రులతో బాటు ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధువులు కూడా సత్యదేవుని దర్శనానికి, వ్రతాలు ఆచరించేందుకు తరలి వచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారిని శనివారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో సుమారు ఐదు వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానంలోని పలు విభాగాల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఏకాదశి, సెలవు దినం అయినందున ఆదివారం కూడా రత్నగిరిపై భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. దీనికి తోడు వివాహాలు కూడా ఉండడంతో సత్రాల్లోని గదులను వివాహ బృందాలు రిజర్వ్ చేసుకోవడంతో సాధారణ భక్తులకు అద్దెకు గదులు దొరికే అవకాశం తక్కువ.

12న అమలాపురంలో జాబ్‌మేళా

అమలాపురం రూరల్: ఇక్కడి కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం తెలిపారు. ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

అడ్డంగా దొరికినా ఆందోళనలేనా?

- చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ శ్రేణుల హంగామా
- రోడ్డుపై బైఠాయించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- ముందస్తు జాగ్రత్తగా ఉదయం డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- యథాతథంగా జనజీవనం



ఎస్పీ జగదీష్ ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో మోహరించిన పోలీసులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఎలాంటి తప్పూ చేయకపోయినా అరెస్టు చేస్తే ప్రతిఘటించడం చూసుంటాం. అక్రమాలతో సంబంధం లేకున్నా పోలీసులు అదుపులోకి తీసుకుంటే నిరసన తెలిపే నేతలను చూసుంటాం. కానీ, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆ పార్టీ నేతలు పడిన పాట్లు విడ్డూరంగా ఉన్నాయి. చంద్రబాబు అరెస్టుపై నిరసనలకు టీడీపీ శ్రేణులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రజల నుంచి కనీస స్పందన లేకపోవడంతో ఆందోళన కాస్తా అభాసుపాలైంది. ప్రజలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలన్న వారి కుట్ర ఫలించలేదు. మరోపక్క ఇప్పటికే చంద్రబాబు వ్యవహార శైలితో విసిగిపోయిన పార్టీ శ్రేణుల్లో కొందరు ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆందోళనలకు పెద్దగా ఆసక్తి చూపలేదు. రోడ్డు పైకి వెళ్లి నిరసన తెలపడం ఎందుకని భావించి, ముందస్తుగా హౌస్ అరెస్టు అయ్యారు. ఏ చిన్న సంఘటన చోటు చేసుకున్నా రోడ్డుపై పడి ప్రభుత్వంపై బురద జల్లే టీడీపీ నేతలు.. చంద్రబాబు అవినీతి కుంభకోణంలో అడ్డంగా బుక్కయిపోవడంతో పూర్తి స్థాయిలో రోడ్డెక్కలేదు. నామ్ కా వాస్తే అన్న చందంగా కొంతసేపు నిరసనలు తెలిపి ఇళ్లకు జారుకున్నారు.

ఓవర్ యాక్షన్

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో 'పచ్చ' నేతలు అక్కడక్కడ ఓవర్ యాక్షన్ చేశారు. దుకాణాలు మూసివేయాలంటూ యజమానులపై చిందులు తొక్కారు. ఎవరూ స్పందించకపోవడంతో వెనక్కు తగ్గారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా లాభం లేకపోవడంతో చేసేది లేక వెనుదిరిగారు. కొన్ని ప్రాంతాల్లో బలవంతంగా షాపులు మూయించారు. వారు వెళ్లిన గంటల వ్యవధిలోనే వ్యాపారులు తిరిగి దుకాణాలు తెరచి యథావిధిగా వ్యాపారాలు నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు ఆర్టీసీ బస్సులను ఉదయం డిపోలకే పరిమితం చేశారు. మధ్యాహ్నం నుంచి యథావిధిగా నడిపారు.

పటిష్టంగా పోలీసు బందోబస్తు

చంద్రబాబు అరెస్టు దృష్ట్యా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆయన అరెస్టయిన క్షణం నుంచే శాంతిభద్రతల పరిరక్షణకు రంగంలోకి దిగారు. అక్కడక్కడ రోడ్ల పైకి వచ్చిన టీడీపీ శ్రేణులను ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ నిలువరించారు. ఆందోళన ఉధృతమైతే అదుపులోకి తీసుకుని, పోలీసు స్టేషన్లకు తరలించి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఫలితంగా జిల్లాలో ఎటువంటి హింసాత్మక ఘటనలూ చోటు చేసుకోలేదు.

బంద్‌కు స్పందన నిల్

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలో ఎటువంటి బందూ జరగలేదు. వ్యాపార సముదాయాలు, సినిమాహాళ్లు, ప్రైవేటు కార్యాలయాలు యథావిధిగా తెరచుకున్నాయి. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వారి ఇళ్ల వద్ద ఆందోళనకు దిగగా, పోలీసులు అరెస్టు చేశారు. గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో రోడ్డుపై ఆందోళన చేస్తూ, జన జీవనానికి అంతరాయం కలిగిస్తున్న 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ నేతలు బంద్ చేయిస్తే గంట వ్యవధిలోనే తిరిగి షాపులు తెరిచారు. నిడదవోలులో షాపులు మూసేయాలని టీడీపీ నేతలు హంగామా చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. అనపర్తి నియోజకవర్గంలో బంద్ ప్రభావం కనిపించ లేదు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా స్పందన లేకపోయింది. రాజానగరంలో టీడీపీ నేతలు మొక్కుబడిగా కొద్దిసేపు ఆందోళన చేసి, వెళ్లిపోయారు.



■ చంద్రబాబు తప్పు చేయకపోతే న్యాయ స్థానంలో రుజువు చేసుకోవాలి. కోట్లాది రూపాయలు లూటీ చేసిన ఆయనను అరెస్టు చేస్తే టీడీపీ శ్రేణులు గగ్గోలు పెట్టడం ఎందుకు?

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే, అనపర్తి



■ చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఆయన అరెస్టులో ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు, కుట్రలు, కక్ష సాధింపులు లేవు.

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం



■ నైపుణ్య శిక్షణ పేరుతో రాష్ట్ర యువత భవిష్యత్తును తాకట్టు పెట్టి, ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్న చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదు.

– జి.శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు



■ చంద్రబాబు నాటకాలకు ప్రజలు మోసపోయే రోజులు పోయాయి. ధర్మం, న్యాయం ప్రకారమే చంద్రబాబు అరెస్టు జరిగింది.

– డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, రాజమహేంద్రవరం సిటీ



■ పాపం పండి అవినీతి సమ్రాట్ చంద్రబాబు అరెస్టు అయ్యారు. ఆయనతో సహా చట్టానికి ఎవరూ అతీతులు కారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న చంద్రబాబు బండారం ఆధారాలతో సహా బయట పడటం వల్లనే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఇది చట్ట పరిధిలో జరిగింది. ఆయన ఏ తప్పూ చేయకపోతే చట్టం ముందు తన నిర్దోషిత్వం నిరూపించుకోవాలి. కక్ష సాధింపు అంటూ రాజకీయ విమర్శలు చేయడం మంచిది కాదు. రానున్న రోజుల్లో ఆయన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చి, రాజకీయంగా సమాధి కావడం తథ్యం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి



■ నాడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగిన పేద ముస్లిం యువకులపై చంద్రబాబు నంద్యాలలో దేశద్రోహం కేసులు పెట్టి, జైలుకు పంపారు. నేడు అదే నంద్యాలలో యువతకు నైపుణ్యాన్ని ఇచ్చే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయ్యారు. నేరాలు రుజువైతే ఆయన జీవితమంతా జైల్లోనే గడపాల్సి ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి.

– ఆరిఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్



■ ప్రజాస్వామ్యంలో పాలకులు నీతి, నిజాయితీతో కూడిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజారంజకంగా నిర్వహించాలి. అంతే కానీ అవినీతి, లంచగొండితనం, దోపిడీకి తావుండకూడదు. వాటికి పాల్పడితే శిక్షార్హులు అవుతారు. చట్టం, న్యాయం అందరికీ సమానమే. తమ లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను రెచ్చగొట్టడం మంచిది కాదు. అమాయకులు బలై పోతారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– అప్పారి జయప్రకాష్, విశ్రాంత ప్రిన్సిపాల్, డైట్, బొమ్మూరు

స్కామ్‌ల సుల్తాన్ చంద్రబాబు

- రూ.కోట్ల అవినీతి చేస్తే అరెస్టు చేయకూడదా?
- ప్రజల దృష్టి మరల్చేందుకే నాటకం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: స్కామ్‌లు చేయడంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు మంచి స్కిల్ ఉందని, రూ.వందల కోట్ల అవినీతి చేస్తే అరెస్టు చేయకూడదా? అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రశ్నించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్కామ్‌లు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని.. ఏపీ ఫైబర్ స్కామ్, అమరావతి, ఇసుక, మట్టి, స్కిల్ లాంటి అనేక స్కామ్‌లలో ఆయన ప్రధాన పాత్రధారి అని అన్నారు. అన్ని రంగాల్లోనూ వేల కోట్ల రూపాయల అవినీతికి ఆయన తెర తీశారన్నారు. అలాంటి వ్యక్తిని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టు చేయడం తప్పేమిటని ప్రశ్నించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని, 40 ఏళ్ల రాజకీయానుభవం ఉన్న వ్యక్తిని ఎలా అరెస్టు చేస్తారని చంద్రబాబు సహా, ఆయన అనుకూల మీడియా ప్రశ్నించడం హాస్యాస్పదమని రాజా అన్నారు. ఇలాంటి వారికి రాజ్యాంగం ప్రత్యేకంగా ఉంటుందా? అని దుయ్యబట్టారు. చివరకు రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని నమ్మబలికి మరీ దోపిడీకి తెగబడ్డారని ధ్వజమెత్తారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో, స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో మల్టీ నేషనల్ కంపెనీ సీమెన్స్‌ను ఎరగా చూపి సుమారు రూ.370 కోట్ల అవినీతికి పాల్పడినట్టు ఆధారాలతో సహా దొరికిపోయారని చెప్పారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దివంగత నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏనాడూ సచివాలయానికి రాని, అధికారంలో లేని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వివిధ కుంభకోణాల్లో ఇరికించి, అరెస్టు చేయించారన్నారు. సీమెన్స్ స్కామ్ సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆయన సిఫారసు మేరకు నిబంధనలకు విరుద్ధమైనా సుమారు రూ.370 కోట్లు విడుదల చేయాలని, నాటి ఆర్థిక శాఖ అధికారులు ఫైలులో స్పష్టంగా పేర్కొన్నారని వెల్లడించారు. విడుదల చేసిన రూ.370 కోట్లను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు దిగమింగారన్నారు. ఈ అక్రమాలపై అప్పట్లో ఏసీబీ దర్యాప్తు ప్రారంభిస్తే మధ్యలోనే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తొక్కిపెట్టారని రాజా ఆరోపించారు.

ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తాం

- ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి
- జిల్లా నూతన కమిటీ నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వోద్యోగులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీజీఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. సమాఖ్య జిల్లా కమిటీ సమావేశం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకట్రామిరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా అన్ని రకాల ఉద్యోగుల సమస్యలనూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. 2018లో 16 సంఘాలతో ఏర్పాటు చేసిన ఈ సమాఖ్యలో ప్రస్తుతం 130కి పైగా సంఘాలు చేరాయని, ఇది ఉద్యోగులకు తమ సమాఖ్యపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అర్హత కలిగిన కాంట్రాక్టు ఉద్యోగులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేశారని వెంకట్రామిరెడ్డి చెప్పారు. దీనికి సంబంధించి ఆర్డినెన్స్ అమలులోకి రాబోతోందని తెలిపారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని కోరామని వెంకట్రామిరెడ్డి తెలిపారు. విలేకర్ల సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవ పాల్, వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇదీ నూతన కమిటీ

ఏపీజీఈఎఫ్ తూర్పు గోదావరి జిల్లా నూతన కమిటీని నియమించారు. చైర్మన్‌గా పి.వెంకటరత్నం, సెక్రటరీ జనరల్‌గా జి.గిరిప్రసాద్‌వర్మ, కో చైర్మన్లుగా నరేష్ కుమార్, చైతన్య కుమార్, బి.చిట్టిబాబు, ఆర్.శ్రీనివాస్, వైస్ చైర్మన్లుగా గెడ్డం సత్య వరప్రసాద్, కవల వెంకటరావు, ఎంవీ రెడ్డి, సాయిరామ్, కన్వీనర్‌గా కూచిమంచి సూర్యనారాయణ, కోశాధికారిగా శ్రీవిద్య నియమితులయ్యారు. వీరితో పాటు కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఆరుగురు, సంయుక్త కార్యదర్శులుగా ఆరుగురు, ప్రచార కార్యదర్శులుగా ఆరుగురు, కార్యవర్గ సభ్యులుగా 20 మందిని నియమించారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి



సీఎం సభా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్ తదితరులు

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 14 లేదా 15 తేదీల్లో నిడదవోలు రానున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ జరిగే వైఎస్సార్ కాపు నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని తెలిపారు. నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ గ్రౌండ్‌లో సభా ప్రాంగణం ఏర్పాట్లను ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని ఆదేశించారు. హెలిపాడ్ నుంచి సభా వేదిక వరకూ జరిగే సీఎం జగన్ రోడ్ షోకు బారికేడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో సభా ప్రాంగణంలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ, సీఎం జగన్ పర్యటనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ మాధవి, టౌన్‌ప్లానింగ్ అధికారి సుప్రియ, తహసీల్దార్ ఎం.గంగరాజు, మున్సిపల్ ఏఈ హేమంత్, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం డివిజన్‌లో 144 సెక్షన్

ఆర్డీవో, సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చైత్రవర్షిణి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ నేపథ్యంలో ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలకు చెందిన అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో 144వ సీఆర్ పీసీ సెక్షన్ అమలు చేస్తున్నామని సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ అధికారి ఎ.చైత్రవర్షిణి శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 16వ తేదీ రాత్రి 12 గంటల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికి మించి ఒకచోట గుంపుగా చేరడం, ఆయుధాలు కలిగి ఉండడం, ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బందులు కల్పించే ఉద్దేశంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడడం చేయరాదన్నారు. ఈ విషయంలో పోలీసులకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

కొవ్వూరు: కొవ్వూరు డివిజన్‌లో కూడా 144 సెక్షన్ విధిస్తూ ఆర్డీఓ మల్లిబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

బంగారు ఆభరణాల చోరీ

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలో 216 జాతీయ రహదారి చెంతన ఉన్న షిర్డీ సాయి మందిరం వెనుక వీధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటిన జరిగిన ఈ ఘటనలో రూ.రెండు లక్షల విలువైన ఏడు కాసుల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నారు. పేరాబత్తుల రాధాకృష్ణ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి వెళ్లారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి శనివారం తెలిపారు.

ఆక్వా సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

- విదేశీ ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 40 శాతం
- రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు
- సీఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించిన ఎంపీ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మత్స్య సంపద సృష్టిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వీటి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. శనివారం స్థానిక మంజీర కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్స్ సహకారంతో 4వ ఆక్వా- సీఫుడ్ ఫెస్టివల్ రెండో రోజు కార్యక్రమంలో కమిషనర్ కె.కన్నబాబు, ఎంపీ మార్గాని భరత్ రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కన్నబాబు మాట్లాడుతూ 'ఫిష్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రమోట్ చేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రధాన నగరాల్లో 'సీ ఫుడ్' ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల ఫెస్టివల్‌లో భాగంగా చేపలు, రొయ్యలు, పీతలతో పాటు ఇతర సముద్ర ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సముద్ర ఉత్పత్తులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశాలకు సంబంధించి సీఫుడ్ ఫెస్టివల్‌కు హాజరైన రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆక్వా రంగానికి ప్రాధాన్యం: ఎంపీ భరత్‌రామ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మత్స్య ఉత్పత్తులు విదేశాలకు దేశమంతా జరిగే ఎగుమతుల్లో రాష్ట్రం 40 శాతంతో ముందంజలో ఉందన్నారు. ఆక్వా సాగు పెంచి ఆదాయ వనరుగా జీడీపీ వృద్ధి రేటులో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మత్స్య సంపద వినియోగాన్ని పెంచేందుకు రైతులకు అవసరమైన సబ్సిడీ, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు.

ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెంచాలి: జక్కంపూడి

ఏపీలో చేపల ఉత్పత్తి ఎక్కువగా ఉందని, అయితే వాటిపై అవగాహన లేక తక్కువగా వినియోగం జరుగుతున్నట్లు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఇందుకు సంబంధించి దేశీయ మార్కెటింగ్ మరింత అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్స్, మొబైల్ వాహనాలను ప్రోత్సహించి, రాయితీపై అందించడం ద్వారా ఆయా రంగాలపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, ఇళ్ల వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ సీఈఓ రామకుమార్, మాజీ సీఈఓ సూర్యమిత్ర, భూమి ఆర్గానిక్స్ సంస్థ ప్రతినిధి రఘురామ్, మెరైన్ జేడీ వీవీ రావు, మత్స్య శాఖ అధికారులు వి.కృష్ణారావు, వీవీ రావు, మహమ్మద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తి సునీత, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. తూర్పుగోదారి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 44 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు పరిహారం చెల్లిస్తున్నామన్నారు. కొన్ని బీమా కంపెనీలు మోడల్ చెక్కు పంపిణీ చేస్తామని రావడం అభినందనీయమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ ప్రతి ఏడాది నాలుగు సార్లు జాతీయ లోక్‌అదాలత్, మూడు సార్లు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి డి.విజయ గౌతమ్, స్పెషల్ ట్రిబ్యునల్ జడ్జి ఎస్‌పీఈ, ఏసీబీ కోర్ట్ న్యాయమూర్తి యాయా ప్రసాద్, ఒకటో అదనపు సివిల్ జడ్జి ఎస్‌కే జానీబాషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. రాత్రి 9 గంటల వరకూ 9,125 కేసులు పరిష్కరించారు.

పరిష్కారమైన కీలక కేసులు

సీహెచ్‌వీ రెడ్డి వర్సెస్ శ్రీరామ్ కంపెనీ మధ్య రూ.67 లక్షలకు రాజీ, సి.రామకృష్ణ వర్సెస్ యునైటెడ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.13.75 లక్షలకు రాజీ, బి.మహేష్ వర్సెస్ యునైటెడ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.12.75 లక్షలు, వై.రామకృష్ణ వర్సెస్ బజాజ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.11 లక్షలు, సి.రామకృష్ణ వర్సెస్ రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ మధ్య రూ.13 లక్షలు, బి.మహేష్‌కుమార్ వర్సెస్ ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ మధ్య 13.75 లక్షలు, జి.సతీష్ కుమార్ వర్సెస్ ఏపీఎస్ ఆర్టీసీ మధ్య రూ.8 లక్షలకు రాజీ ద్వారా పరిష్కారం లభించింది.

504 మద్యం బాటిళ్ల స్వాధీనం


గోపాలపురంలో నిందితులు, మద్యాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెం రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 504 మద్యం బాటిళ్లను శుక్రవారం గోపాలపురం పోలీసులు పట్టుకున్నారు. యానాం నుంచి చిన కారులో మద్యాన్ని తరలిస్తుండగా ఎస్ఐ సతీష్‌కుమార్, ఆయన సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.1.45 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కాకినాడకు చెందిన నరుకుల వెంకటేష్, గోపాలపురానికి చెందిన మేకా రమేష్‌లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.30 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
ఆదివారం ॥ 10-9-2023

వైరల్





గ్రీన్ సిగ్నల్

పట్టణాల్లోని చిన్న అపార్ట్‌మెంట్‌వాసుల నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మొక్కలు అంటే మాకు చాలా ఇష్టం. కాని స్థలం ఎక్కడిది?'

'స్థలం పెద్దగా అక్కర్లేదు. పెంచాలనే సంకల్పం ఉంటే చాలు' అంటుంది బిహార్‌కు చెందిన కమల్‌సింగ్.

ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో ఉంటున్న కమల్‌సింగ్ తన చిన్న అపార్ట్‌మెంట్ బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచుతుంది.

'వంటగది వ్యర్థాలతో కంపోస్ట్‌ను ఎలా తయారు చేయాలి?' అనే విషయం నుంచి ఏ మొక్కలను ఎలా పెంచాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వరకు... ఎన్నో విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'అర్బన్ హోమ్ వైబ్స్'కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'స్టార్ట్ వేర్ యూ ఆర్ విత్ వాటెవర్ యూ హ్యావ్' అంటున్న కమల్‌సింగ్ స్ఫూర్తితో ఎంతో మంది పట్టణ వాసులు తమ బాల్కనీలో మొక్కల పెంపకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి 'మేము సైతం' అంటున్నారు.



మలాలాతో మహ్నూర్

బహుముఖ ప్రజ్ఞాశాలి

పదహారు సంవత్సరాల బ్రిటీష్-పాకిస్థానీ మహ్నూర్ ఛీమ లండన్‌లోని జనరల్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసిఎస్ఈ) లెవెల్‌లో 34 సబ్జెక్‌లలో టాప్ గ్రేడ్ సాధించి రికార్డ్ సృష్టించింది. గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రంలాంటి శాస్త్రాలు, ఫ్రెంచ్, లాటిన్... మొదలైన భాషలలో అద్భుతమైన ప్రతిభ చూపుతుంది మహ్నూర్. ఆమె ఎంచుకున్న 34 సబ్జెక్ట్‌లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్, ఫిల్మ్ స్టూడియోస్, సైకాలజీ... మొదలైన సబ్జెక్ట్‌లు ఉన్నాయి.

'ఇది మహ్నూర్‌కు మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఈతరంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అని ట్వీట్ చేశారు పాక్ మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్.

'వైద్యురాలిగా పదిమందికి సేవ చేయాలి' అనేది తన జీవిత ఆశయంగా చెబుతుంది మహ్నూర్.

ఇదిగో సారూ... నా మేక టికెటు



గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జంతువులను కుటుంబసభ్యులుగా చూసుకుంటారు. పేర్లు పెట్టి ప్రేమగా పిలుచుకుంటారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళ మేకను పెంచుకుంటుంది. ఒకరోజు ఆమె వేరే ఊరికి పోవాల్సి వచ్చింది. మేకను ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడం ఇష్టం లేక తనతో పాటు తీసుకెళ్లింది. విశేషం ఏమిటంటే మేకకు కూడా ట్రైన్ టికెట్ తీసుకుంది. ఐఏఎస్ అధికారి అవినాష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ అయింది.

'తన మేకకు కూడా టికెట్ తీసుకున్న విషయాన్ని టీటీయితో ఎంత గర్వంగా చెబుతుందో చూడండి' అని రాశారు అవినాష్.

ఇక వీడియో క్లిప్ విషయానికి వస్తే... టికెట్ చూపించమని ఆమెను టీటీయి అడుగుతాడు. 'ఇదిగో' అంటూ చూపిస్తుంది.

'నీ సంగతి సరే, మరి మేకకు టికెట్ తీసుకున్నావా?' అని సరదాగా అడుగుతాడు టీటీయి.

'అమ్మో...తీసుకోకుండా ఎలా ఉంటాను. ఇదిగో టిక్కెట్టు' అని చూపిస్తుంది.

'నేను తరచుగా రైల్లో ప్రయాణిస్తుంటాను. టికెట్ లేకుండా ట్రైన్‌లో ప్రయాణించి టీటీయికి దొరికి పోయేవారిని చాలామందిని చూస్తుంటాను. వారిని గుర్తు తెచ్చుకున్నప్పుడు ఈమె చాలా గొప్పగా అనిపిస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

కాలం కలిసి వస్తే డంప్‌యార్డ్ కూడా నందనవనం అవుతుంది!



కాలం కలిసే వస్తే... కంపు కొట్టే డంపు యార్డ్ కూడా కనుల విందు చేసే పార్క్ అవుతుంది. రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్‌లో ఒక డంప్ యార్డ్ ఉండేది. దుర్వాసన వల్ల ఆ చుట్టుపక్కల నుంచి నడిచి వెళ్లాలంటే జనాలు జడుసుకునేవారు. అలాంటి చోటుకు ఇప్పుడు జనాలు వెదుక్కుంటు వస్తున్నారు. దీనికి కారణం ఈ డంప్‌యార్డ్‌ను మున్సిపాలిటీ సిబ్బంది అందమైన పార్క్‌గా తయారుచేయడమే.

వాటర్ ఫౌంటెన్‌లు, పచ్చటి గడ్డితో ఈ పార్క్ కనువిందు చేస్తోంది.

ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ సవిత దావియా ఈ క్లిప్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

'ఎన్నో పట్టణాలలో ఎన్నో డంప్‌యార్డ్‌లు భయపెడుతున్నాయి. అవి కూడా ఇలాగే నందనవనంలా మారితే ఎంత బాగుంటుంది' అంటూ ఒక ఎక్స్ యూజర్ స్పందించాడు.

కథక్ నుంచి తీన్మార్ వరకు

బెల్జియన్ కంటెంట్ క్రియేటర్ ఈడీ పీపుల్ వివిధ ప్రాంతాలలో లోకల్స్‌తో కలిసి చేసే డ్యాన్స్ వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా ఫేమ్ అయ్యాయి. ఏదైనా ప్రాంతానికి వెళ్లిన పీపుల్ స్థానికులను 'మీకు ఇష్టమైన డ్యాన్స్ ఏమిటి?' అని అడగడమే కాదు 'నాకు నేర్పించగలరా?' అని రిక్వెస్ట్ చేసి ఓపిగ్గా నేర్చుకుంటాడు.

అలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లను నేర్చుకుంటూ, స్థానికులతో పోటీ పడి డ్యాన్స్ చేస్తుంటాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

తాజాగా మన దేశానికి సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు చేసి 'వారేవా' అనిపించుకున్నాడు.

'మీ డ్యాన్స్ చూస్తుంటే భారతీయ పౌరసత్వం ఇవ్వాలనిపిస్తుంది'

'మా దేశంలోని కొన్ని అద్భుతమై డ్యాన్స్‌లను మిస్ అయ్యారు. వాటిని కూడా చేస్తే బాగుంటుంది' అంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈడీ పీపుల్ షేర్ చేసిన డ్యాన్స్ వీడియోలపై నెటిజనులు స్పందించారు.





అటు చూస్తే జవాన్ ఇటు చూస్తే ఆఫీస్...

అటు చూస్తే బాదం హల్వా ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ... అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆ బెంగుళూరు ఐ.టి ఉద్యోగికి కూడా సంకటం వచ్చింది. ఒకవైపు జవాన్ రిలీజ్. మరోవైపు సాఫ్ట్‌వేర్ డ్యూటీ. చివరకు అతను రెండూ చేశాడు. వైరల్ అయ్యాడు.

బెంగళూరులోనే ఇటువంటివి జరుగుతుంటాయి. మొన్నా మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ర్యాపిడో బైక్ వెనుక కూచుని ఆఫీస్‌కు వెళుతూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే బైక్ మీదే ల్యాప్‌టాప్ తెరిచి లాగిన్ అయ్యి డ్యూటీ మొదలెట్టేశాడు. భారీ ట్రాఫిక్ వల్ల క్యాబుల్లో ఎక్కగానే ల్యాప్‌టాప్‌లు తెరిచే వాళ్లా అక్కడ ఎక్కువే. ఇప్పుడు ఒక ఉద్యోగి ఏకంగా సినిమా హాల్లోనే ల్యాప్‌టాప్ తెరిచాడు. ఏం చేస్తాడు మరి? షారూక్ ఖాన్ ఫ్యాన్. ఫస్ట్ డే ఫస్ట్ షో. సరిగ్గా ఆ టైమ్‌కే లాగిన్ అవ్వాలి. అందుకని థియేటర్‌లో ల్యాప్‌టాప్‌లో వేళ్లు టిక్కుటక్కుమంటుంటే కళ్లు సినిమాకు అంకితం అయ్యాయి. వెనుక కూచున్న ఒక వ్యక్తి ఇది ఫొటో తీసి ఇన్‌స్టాలో పెడితే లక్షల కొద్దీ వ్యూస్ వచ్చాయి. 'బెంగళూరులో ఇక పని చేయకుండా వదిలేసిన చోటు ఏదీ లేదు' అని కామెంట్లు చేస్తూ ఏడవ లేక నవ్వుతున్నారు.



హెల్త్

చాలారకాల వైరల్ జ్వరాల్లాగే డెంగీ కూడా తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) వ్యాధి. అయితే కొంత మందిలో మాత్రం ప్లేట్‌లెట్లు ప్రమాద స్థాయి కంటే కిందికి పడిపోతాయి. అది మినహా చాలావరకు డెంగీ నుంచి దాదాపుగా అందరూ కోలుకుంటారు. పైగా ఇది వైరల్ జ్వరం కావడంతో కేవలం లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తూ... ప్లేట్‌లెట్ కౌంట్‌ను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇటీవల పెద్దసంఖ్యలో ఈ కేసులు వస్తున్న నేపథ్యంలో డెంగీపై అవగాహన కోసం ఈ కథనం.



డెంగీ నివారణ ఇలా...!

డెంగీలో రకాలు

డెంగీ రకాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. అవి... ఏ హెచ్చరికలూ లేకుండా వచ్చే డెంగీ (**డెంగీ విదవుట్ వార్నింగ్ సైన్స్**) ; కొన్ని హెచ్చరికలతో వచ్చే డెంగీ (**డెంగీ విత్ వార్నింగ్ సైన్స్**) ; తీవ్రమైన డెంగీ (**సివియర్ డెంగీ**)

లక్షణాలు

హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా వచ్చే డెంగీ : డెంగీ ఎండెమిక్ ప్రాంతాల్లో... అంటే డెంగీ ఎక్కువగా వస్తున్న ప్రాంతంలో ఇది కనిపిస్తుంటుంది. వీళ్లలో జ్వరం, వికారం/వాంతులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ర్యాష్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్ని హెచ్చరికలతో కనిపించే డెంగీ : పైన చెప్పిన లక్షణాలతో పాటు పొట్ట నొప్పి, ఊపిరితిత్తుల చుట్టూ ఉండే ప్లూరా అనే పొరలో లేదా పొట్టలో నీరు చేరడం. కొందరిలో పొట్ట లోపలి పొరల్లో రక్తస్రావం అవుతుండటం, బాధితులు అస్థిమితంగా ఉండటం, రక్తపరీక్ష చేయించినప్పుడు ఎర్ర రక్త కణాలకూ, మొత్తం రక్తం పరిమాణానికి ఉన్న నిష్పత్తి కౌంట్ పెరగడంతో పాటు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది.

తీవ్రమైన డెంగీ (సివియర్ డెంగీ) కేసుల్లో : అంతర్గత అవయవాల్లో రక్తస్రావం కారణంగా బాధితుడు తీవ్రమైన షాక్‌కు గురవుతాడు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు స్పృహకోల్పోవచ్చు లేదా పాక్షిక స్పృహలో ఉండవచ్చు. మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో కీలకమైన అవయవాలు పనిచేయకుండా పోవచ్చు.

నిర్ధారణ పరీక్షలు :

● సీబీపీ ప్రతి 24 గంటలకు ఒకసారి చేయాలి. ● నిర్ధారణ కోసం డెంగీ ఎన్ఎస్1 యాంటీజెన్ పరీక్ష అవసరం కావచ్చు.

● డెంగీ ఐజీఎమ్ అనే పరీక్ష కూడా చేయాలి. కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు వచ్చేందుకు పట్టే సమయం కూడా ఎక్కువే కాబట్టి డాక్టర్లు అవి వచ్చే వరకు ఆగకుండా... లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రారంభిస్తారు.

● పై పరీక్షలతో పాటు ఇప్పుడు ఐపీఎఫ్ (ఇమ్మెచ్యూర్ ప్లేట్‌లెట్ ఫ్రాక్షన్) అనే అత్యాధునిక పరీక్ష అందుబాటులో ఉంది. ఇది ప్లేట్‌లెట్లను ఎప్పుడు, ఎంత పరిమాణంలో ఎక్కించాలో తెలుసుకోవడంతో పాటు మరెన్నో అంశాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

నివారణ ఇలా...

అన్ని వ్యాధుల్లోలాగే డెంగీలోనూ చికిత్స కంటే నివారణ ఎంతో మేలు. డెంగీని కలిగించే టైగర్ దోమ పగటిపూటే కుడుతుంది. దీని సంతానోత్పత్తి మంచి నీటిలోనే. ఈ ప్రక్రియకు పదిరోజుల వ్యవధి పడుతుంది. కాబట్టి వారంలోని ఏదో ఒక రోజు ఇంటిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే గా పాటిస్తే, దీని జీవితచక్రానికి విఘాతం కలిగి ప్రత్యుత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది.

● ఇళ్ల మూలలూ, చీకటి, చల్లటి ప్రదేశాలే టైగర్ దోమల ఆవాసం. ఇల్లంతా వెలుతురు, సూర్యరశ్మి ధారాళంగా వచ్చేలా చూసుకోవడంతో పాటు, దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు మెష్ అమర్చుకుంటే...ఒక్క డెంగీ దోమలే కాకుండా...మలేరియా, ఇతర వ్యాధులకు గురి చేసే దోమల్నీ నివారించినట్లు అవుతుంది.

● టైగర్ దోమ పెద్దగా ఎత్తుకు ఎగరలేదు. అందువల్ల కాళ్లు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులతో, ఫుల్‌స్లీవ్‌తో చాలావరకు రక్షణ కలుగుతుంది. ● నిల్వ నీటిలోనే దోమ గుడ్లు పెడ్తుంది కాబట్టి కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, బ్యారెల్స్, టైర్లు, కూలర్లు, పూలకుండీల కింద పెట్టే ప్లేట్లు మొదలైన వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. అలాగే వాడని డ్రమ్ముల్ని బోర్లించి ఉంచాలి.

● దోమలను తరిమివేసేందుకు మస్కిటో రిపలెంట్స్ వాడవచ్చు.

డెంగీలో మరింత ప్రమాదకరమైన కొన్ని లక్షణాలివి...

● ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో అంతర్గత అవయవాలలోకి రక్తస్రావం అయ్యే ప్రమాదంతో పాటు ఒంట్లోకి నీరు చేరడం, సివియర్ డీహైడ్రేషన్‌కు గురికావడం జరగవచ్చు. ● కొందరిలో హీమోగ్లోబిన్ కాన్సంట్రేషన్ పెరుగుతుంది. హెమటోక్రిట్ పెరుగుతుంది. దీనివల్ల రక్తం గడ్డకట్టదు. రక్తపోటు పడిపోతుంది. లివర్ ఎన్‌లార్జ్ అయి, అది దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండెస్పందనలు నిమిషానికి 60 కంటే తక్కువకు కూడా పడిపోవచ్చు. ఇలా గుండె స్పందనలు తగ్గినప్పుడు బాధితుల్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాల్సి వస్తుంది. బ్లీడింగ్, ఫిట్స్ వల్ల మెదడు దెబ్బతినే ప్రమాదమూ ఏర్పడవచ్చు. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) పూర్తిగా దెబ్బతినడానికీ అవకాశముంది.



టీకా ఉందిగానీ...

ప్రస్తుతం డెంగీకి టీకా (వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నప్పటికీ ఇది అందరూ తీసుకునే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. గతంలో ఓసారి డెంగీకి గురైన వారికి మాత్రమే టీకా ఇవ్వాలి. ఎందుకంటే రెండోసారి వచ్చే డెంగీ రావడం రావడమే చాలా ప్రమాదకరంగా ఉండి ప్రాణాపాయమూ కల్పించవచ్చు. కాబట్టి ఆ పరిస్థితిని నివారించేందుకు ఒకసారి డెంగీ వచ్చినవారికి మాత్రమే టీకా ఇస్తారు.

డెంగీ వస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిలో మినహాయించి అది అందరిలోనూ ప్రమాదకరం కాదు. కాకపోతే గర్భిణులు, చిన్నారులు, పెద్దవయసు వారికి డెంగీ సోకినప్పుడు అది తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

చికిత్స...

డెంగీ అన్నది వైరస్ కారణంగా వచ్చేది కాబట్టి దీనికి నిర్దిష్టంగా మందులేమీ ఉండవు. అందువల్ల లక్షణాలకు మాత్రమే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్) ఇస్తారు. అంటే... అవసరమైనప్పుడు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, అవసరాన్ని బట్టి రక్తాన్ని, ప్లేట్‌లెట్స్‌ను, ప్లాస్మా ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేల నుంచి 15 వేలు లేదా అంతకంటే తక్కువకు పడిపోతేనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

పిన్‌వార్మ్ / థ్రెడ్ వార్మ్ ఇన్ఫెక్షన్ అంటే...?



కొందరు చిన్నారుల్లోని ప్రైవేట్ ప్రాంతాల్లో సన్నటి దారాల్లాంటి క్రిములు కనిపిస్తుంటాయి. మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు కనిపించే ఇవి నిజానికి మల ద్వారం నుంచి వస్తుంటాయి. అవయవ నిర్మాణపరంగా (అనటామికల్‌గా) మూత్ర విసర్జన ప్రాంతం (యురెథ్రా)... మల ద్వారానికి దగ్గరగా ఉండటంవల్ల ఇవి మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు అనిపిస్తుంటాయి. సన్నటి దారాల్లాంటి ఆకృతిని బట్టి వాటిని థ్రెడ్‌వార్మ్స్ లేదా పిన్‌వార్మ్స్ అంటారు. ఈ ఇన్ఫెక్షన్‌ను 'ఎంటిరోబియాసిస్' అని కూడా చెబుతారు.

యుక్తవయసుకు వచ్చిన (అడల్ట్) పిన్ వార్మ్స్ పెద్ద పేగుల్లో నివాసముంటాయి. ప్రతి అడల్ట్ జీవి 10,000 గుడ్లు పెడుతుంది. రాత్రివేళల్లో ఆడ పిన్‌వార్మ్ పెద్దపేగు (కోలన్) నుంచి మలద్వారం (రెక్టమ్) ద్వారా బయటకు వచ్చి పిరుదుల ప్రాంతంలో గుడ్లను వదిలేస్తుంది. ఆ గుడ్లు పిరుదుల మీద, మలద్వారం పరిసరాల్ని అంటిపెట్టుకుని ఉంటాయి. కొన్ని గుడ్లు గాల్లోకి కూడా వ్యాపిస్తాయి. వాటి నుంచి బయటకు వచ్చిన లార్వాలు బయటకు పిరుదులు, మలద్వారం, మూత్రద్వారం దగ్గర తచ్చాడుతుంటాయి. దురద కారణంగా పిల్లలు అక్కడ గీరుకున్నప్పుడు అవి గోళ్లలోకి చేరుతాయి. అవే చేతుల్ని నోట్లో పెట్టుకున్నప్పుడు అవి కడుపులోంచి మళ్లీ పెద్ద పేగుల్లోకి చేరి... ఇలా జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంటాయి. వాటి లైఫ్ సైకిల్ పూర్తి కావడానికి 4-6 వారాలు పడుతుంది.

వ్యాప్తి ఇలా...

పిల్లలు ఆడుకునే బొమ్మలు, బెడ్ షీట్స్, తువాళ్లూ, లోదుస్తులు, టాయిలెట్ సీట్స్ ద్వారా తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. మరీ చిన్నపిల్లల్లో వాడిన డయపర్స్‌ను పెద్దలు ముట్టుకున్న తర్వాత వేరే పిల్లలను పట్టుకున్నప్పుడు కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అయితే ఈ పిన్‌వార్మ్ ఇన్ఫెక్షన్ పెంపుడు జంతువుల (పెట్స్) ద్వారా ఇతరులకు వ్యాపించదు.

నివారణ చర్యలివి...

● పిల్లలకు ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయించాలి. ● పిల్లలు తరచూ చేతులు శుభ్రంగా కడుక్కునేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలి. ముఖ్యంగా మలవిసర్జన తర్వాతా, మట్టిలో ఆడిన తర్వాత పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కునేలా చూడాలి. ● పిల్లల గోళ్లు ఎక్కువగా పెరగకుండా వాటిని ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి. ● పిల్లలు తమ గోళ్లు కొరక్కుండా చూడాలి. గోళ్లు కొరికే అలవాటు ఉంటే మాన్పించాలి. ● ఇంట్లో ఎవరికైనా పిన్‌వార్మ్ ఇన్ఫెస్టేషన్ ఉంటే వాళ్లతో పాటు మిగతావాళ్లూ చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఇది తరచూ తిరగబెడుతుండే అవకాశాలు ఎక్కువ.

చికిత్స... మెబెండజోల్, ఆల్బెండజోల్, పెరెంటల్ పాల్మోయేట్ అనే మందుల్ని తగిన కోర్సులుగా ఇవ్వడం ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

పిల్లల్లో పొరబోయిందా? గొంతులో ఏదైనా ఇరుక్కుందా?

పిల్లలు తినే సమయంలో వారి గొంతులో ఏదైనా ఇరుక్కున్నపుడు పొర పోయిందని పెద్దలు అంటుంటారు. తిన్న ఆహారం కిందికి కదలడం కోసం తలపై తడుతుంటారు. కానీ గొంతులో ఇరుక్కున్న ఆహారంగానీ లేదా నాణెంలాంటి వస్తువుగానీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయునాళంలోకి పోతే చాలా ప్రమాదం. ఇలా ఆహారం ఇరుక్కున్నా లేదా ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కున్నా హాస్పిటల్‌కు వెళ్లేలోపు ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించాలి.

● పిల్లల నోరు బాగా తెరిపించి, నాలుక బాగా చాపేలా చేసి, గొంతులోకి వేళ్లుపోనిచ్చి చేతికి ఏదైనా తగులుతుందేమో చూడాలి. తగిలితే వెంటనే బయటకు తీసేయాలి. ● పిల్లాడి వెనక పెద్దలెవరైనా నిల్చుని, వారి రెండు చేతుల్నీ పొట్టచుట్టూ బిగించి, అకస్మాత్తుగా చేతుల్తో పట్టుబిగుస్తున్నట్లుగా కదిలించాలి. ఇది క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేస్తుండాలి. దాంతో పొట్ట దగ్గర ఒత్తిడి పెరిగి, గొంతులో ఇరుక్కున్నది బయటకు రావచ్చు. దీన్ని హీమ్‌లిచ్ మెనోవర్ అంటారు.



● ఇదే గనక చాలా చిన్నపిల్లల్లో / పసిపాపల్లో చేయాల్సి వస్తే... పెద్దలు కుర్చీలో కూర్చుని, చిన్నారులు తలకిందులుగా ఉండేలా, వాళ్లను తమ కాళ్లపైన బోర్లా పడుకోబెట్టాలి. ఇలా పడుకోబెట్టాక, చిన్నారుల వీపుపై అకస్మాత్తుగా ఒత్తిడి కలిగేలా నొక్కాలి. ఇది ఎలా జరగాలంటే... చిన్నారుల నడుము నుంచి వారి రెండు భుజాల మధ్య ప్రాంతంలో మృదువుగా ఒత్తిడి కలిగేలా కదిలిస్తుండాలి. ఇది కూడా క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేయాలి. ఒకవైపు పొట్ట మీద పెద్దల కాళ్ల ఒత్తిడీ, మరోవైపు వీపు మీద చేతుల ఒత్తిడి కారణంగా గొంతులో అడ్డు పడ్డ పదార్థం బయటకు వచ్చే అవకాశం ఉంది. ● ప్రథమ చికిత్సగా ఇవి చేస్తూ... వీలైనంత త్వరగా పిల్లల్ని హాస్పిటల్‌కు తరలించాలి. ఈ ప్రక్రియలతో గొంతులో ఇరుక్కున్నవి బయటకు వస్తే సరి. లేదంటే హాస్పిటల్‌లో అవసరాన్ని బట్టి ఎండోస్కోప్ వాడి, ఇరుక్కున్న పదార్థాన్ని డాక్టర్లు బయటకు తీస్తారు.